ఛిద్రమవుతున్న రోడ్లు

- అధ్వానంగా కౌటాల -సిర్పూర్ రోడ్డు
- లారీల్లో అధికలోడుతో కంకర తరలింపు
- గుంతలతో ప్రయాణికుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు



సిర్పూర్ సమీపంలో కౌటాల-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై గుంతలు

కౌటాల: కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిని ఆరేళ్ల క్రితం రూ.కోట్ల నిధులతో డబుల్ రహదారిగా నిర్మించారు. ఈ రహదారిపై నుంచి అధిక లోడుతో వాహనాలు వెళ్తుండడంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఇటీవల కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు రహదారికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. కానీ సిర్పూర్(టి) నుంచి కౌటాల వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. మరోవైపు నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్(టి) మండల కేంద్రంలో, కౌటాల మండల కేంద్రంలోని రహదారులు వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. రోడ్డుపై ఏర్పడిన లోతైన గుంతలను గమనించకుండా పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు సైతం ఉన్నాయి. సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో కౌటాల -కాగజ్‌నగర్ రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రంలో అడుగడుగున భారీ గుంతలు ఉండడంతో రెండు కిలోమీటర్ల మేర మండల కేంద్రంలో ప్రయాణించడానికి దాదాపు 20 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. కౌటాల మండల కేంద్రం జిల్లాలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. మండల కేంద్రం అటు చింతలమానెపల్లి, ఇటు బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాలకు మధ్యలో ఉండడంతో పాటు కౌటాలలో ఇళ్లను అద్దెకు తీసుకొని ఉండటానికి ఉద్యోగులు ఇష్టపడుతున్నారు. కానీ కౌటాల మండల కేంద్రంలోని ఏ ఒక్కరోడ్డు కూడా సరిగా లేదు. రోడ్డుపై భారీ గుంతలు ఉండడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు.

ప్రమాదకరంగా వంతెనలు..

కౌటాల -సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఉండడంతో పాటు రోడ్డు వెంబడి ప్రమాదాలు సైతం పొంచి ఉన్నాయి. కౌటాల మండలం ముత్తంపేట సమీపంలోని వాగుపై గల వంతెన, సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామ సమీపంలోని వాగుపై గల వంతెనకు రక్షణ గోడ పగిలిపోయింది. దీంతో వాహనదారులకు రక్షణ లేకుండా పోతోంది. వంతెనపై గల రోడ్డుపై గుంతలు ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. సిర్పూర్(టి) పెద్దవాగుపై గల వంతెన సమీపంలోని రోడ్డుపై కల్వర్టు భారీ వర్షాలకు కోతకు గురైంది. రోడ్డుపై భారీ గుంతలు ఉన్నా అధికారులు హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

ఓవర్ లోడ్..

కౌటాల మండలంలో ముత్తంపేట నుంచి పార్డీ గ్రామానికి వెళ్లే మార్గంలో ఐదు కంకర క్వారీలు, క్రషర్లు ఉండటంతో నిత్యం వందలాది భారీ వాహనాలు కంకరలోడ్‌తో రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు కంకరను తరలించడంతో కౌటాల, ముత్తంపేట, తలోడి, సిర్పూర్(టి), టొంకిని గ్రామాల వద్ద ప్రధాన రహదారి అనేక చోట్ల గుంతలమయంగా మారింది. పరిమితికి మించి కంకరతో గ్రామీణ రోడ్ల గుండా లారీలు వెళ్తుండటంతో దుమ్ముతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. లారీ డ్రైవర్లు అతివేగంగా లారీలను ఇష్టారీతిన నడుపుతుండడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. దీంతోపాటు ఓవర్ లోడ్, అతివేగంగా వెళ్లే కంకర లారీలు బోల్తా పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఓవర్‌లోడ్‌తో కంకర తరలిస్తున్న క్రమంలో లారీల్లో నుంచి కంకర ప్రధాన రహదారిపై కుప్పలుగా పడుతోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు కౌటాల -సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై గల గుంతలను పూడ్చి వేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

ఒక్కరోడ్డు కూడా సరిగా లేదు



కౌటాల మండల కేంద్రంలో, సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలపై మండల కేంద్రాల్లో ప్రయాణించేటప్పుడు నరకయాతన పడుతున్నారు. కౌటాల మండల కేంద్రంలో ఏ ఒక్క రోడ్డు సరిగా లేదు. మండల కేంద్రాల్లోని రోడ్లపై భారీ గుంతలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– బి.శివకుమార్, కౌటాల



సిర్పూర్(టి) డౌనల్ ప్రాంతంలో రోడ్డు పై గుంతలు



అధ్వానంగా కౌటాల రహదారి

గుండి వాగుపై తాత్కాలిక వంతెన



గుండివాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన

ఆసిఫాబాద్‌రూరల్: గుండి వాగుపై శనివారం పైపులు వేసి తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. గుండివాగుపై వంతెన నిర్మాణం కోసం పిల్లర్‌దశ వరకు పనులు పూర్తి చేసి అసంపూర్తిగా వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు ప్రతీ ఏడాది వాగులో పైపులు వేసి మట్టితో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల మంత్రి సీతక్క జిల్లా పర్యటనలో భాగంగా వంతెన త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. వంతెన పూర్తి చేసి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థిని కొట్టిన టీచర్

- బూర్గుడ పాఠశాలలో తల్లిదండ్రుల ఆగ్రహం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థిని టీచర్ కొట్టడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఆందోళన చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అభిరాంను గణిత ఉపాధ్యాయుడు సంతోష్ లెక్కలు సరిగ్గా చేయడం లేదని శుక్రవారం తలపై కొట్టారు. విద్యార్థి ఇంటికి వెళ్లిన తర్వాత తీవ్రంగా తలనొస్తుందని, పాఠశాలలో టీచర్ తలపై గట్టిగా కొట్టాడని తల్లిదండ్రులకు తెలిపాడు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని నిలదీశారు. విద్యార్థిని తలపై కొట్టడంతో చెవుల నుంచి రక్తం వస్తుందని వాపోయారు. విద్యార్థి చికిత్సకు అయ్యే ఖర్చులను సదరు టీచర్ భరిస్తాడని హెచ్‌ఎం తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో తల్లిదండ్రులు విద్యార్థిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా ఇటీవల సదరు ఉపాధ్యాయుడు తమకు వద్దని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థులు ధర్నా చేపట్టడం గమనార్హం.

ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



శ్రీరామ్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

వాంకిడి: ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించిన శ్రీరామ్‌ను శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కళాశాల పూర్వ విద్యార్థిగా ప్రస్తుతం దేశ రక్షణలో సేవలు అందించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు శ్రీరామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సురేందర్ కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్ కుమార్, తిరుపతి, సత్యం, సంతోష్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేసేలా చూస్తాం

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడ ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయ్యేలా చూస్తామని ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సాక్షి దినపత్రికలో 'పాఠశాలలో వసతులు కరువు' కథనాన్ని శనివారం ప్రచురించింది. దీంతో ఐటీడీఏ ఏఈ సునీల్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న వంటగదిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పనులు చేయడం జరిగిందన్నారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. త్వరలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఏఈ సునీల్‌కు ఆదేశించారు.

క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజు

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై కందూరి రాజు అన్నారు. శనివారం మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పూర్వవిద్యార్థి సుదీక్ష, ఎన్ఆర్ఐ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ దుస్తులు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 40 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందించడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెరమెరిలో 24న కుమురం భీం వర్ధంతి



మాట్లాడుతున్న నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ఈ నెల 24న ఆదివాసీ భవన్‌లో అమర వీరుడు కుమురం భీం 84 వర్ధంతిని నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని ఆదివాసీ సంఘాల నాయకులు, దేవారి, పటేల్, సర్‌మోడీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు విధిగా హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, రాజ్‌గోండ్ సేవాసమితి మడావి రఘునాథ్, భీం ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, నాయకులు కనక ప్రభాకర్, భీంరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ 33/11 కేవీ ఎస్ఎస్ ఆసిఫాబాద్, ఆసిఫాబాద్ రూరల్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల్లో భాగంగా ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ సహాయక ఇంజినీర్ సదాశివ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

108లో ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

కౌటాల: మండలంలోని సైదాపూర్ గ్రామానికి చెందిన గర్భిణీ ఎం. సౌజన్యకు శుక్రవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రాగా కుటుంబసభ్యులు 108కి కాల్ చేశారు. 108 సిబ్బంది గర్భిణీని కౌటాల పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ అజయ్‌కుమార్, పైలెట్ శ్రావణ్ నార్మల్ డెలివరీ చేశారు. తల్లి, ఆడ శిశువు క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఇద్దరిని కౌటాల పీహెచ్‌సీకి తరలించామన్నారు.

'సమావేశానికి తల్లిదండ్రులు హాజరుకావాలి'

కెరమెరి: బడుల్లో నిర్వహించే ప్రతీ సమావేశానికి తప్పకుండా తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో హెచ్‌ఎంలు మాట్లాడారు. ప్రతీనెల మూడో శనివారం ఈ సమావేశం నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థుల ప్రగతితో పాటు పాఠశాల అభివృద్ధిపై చర్చించాల్సి ఉంటుందన్నారు.

'చైతన్య డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఐఈవో కల్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ మాట్లాడుతూ శ్రీ చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాల గత కొన్ని సంవత్సరాలుగా ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారని, ఒకే ప్రాంగణంలో 500 మంది విద్యార్థులకు కళాశాల నిర్వహించడం యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి యూనివర్సిటీ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టీకానంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ



డిక్షనరీలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తంగడిపల్లి రాకేశ్ శనివారం డిక్షనరీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లభాష మీద పట్టుకోసం డిక్షనరీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చౌదరి శ్రీనివాస్, షేక్‌బాబు, ఇస్మాయిల్, వెంకటేశ్, ఉత్తమ్, హెచ్‌ఎం అశోక్ చంద్ర, చౌదరి వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దహెగాం: మండల కేంద్రంలో ఈనెల 14న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గందె వెంకటేశ్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఎంపీ, ఎమ్మెల్యేను ఆహ్వానించడంతో పాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడిని ఆహ్వానించారన్నారు. సిర్పూర్ నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ దళిత సామాజిక వర్గానికి చెందిన సిద్దాల దేవయ్య ను ఆహ్వానించలేదన్నారు. ఈ విషయాన్ని జి ల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మార్కె ట్ కమిటీ డైరెక్టర్ తోగయ్య, మాజీ సర్పంచ్ ఆయిల్ల శంకర్, నాయకులు రాంటెంకి సురేశ్, మల్లేశ్, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో వర్షం

కౌటాల: మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా వర్షాలు లేక వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో కురిసిన వర్షం పంటల కు కొంతమేర ప్రయోజనకరంగా ఉంటుంద ని రైతులు పేర్కొంటున్నారు. వర్షం కారణంగా కౌటాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షాలు లేక కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతకు విసిగిపోతున్న ప్రజలు వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో వేడి నుంచి ఉపశమనం పొందారు. భారీ వర్షం కురిస్తే వరి పంట నేలవాలుతుందని, సోయా పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోట్నాక్ జంగు సేవలు చిరస్మరణీయం

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన గోండి లిపి పండితుడు కోట్నాక్ జంగు గత నెలలో మృతి చెందడంతో శనివారం కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

విద్యుత్ కోతలు.. రైతుల తిప్పలు

- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు



నీరు లేక ఎండిపోయిన వరి పంట



విద్యుత్ సరఫరా లేక వృథాగా బోరు

సిర్పూర్(టి): ఇష్టారాజ్యంగా విధిస్తున్న విద్యుత్ కోతలతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. అసలే వర్షాలు సరిగా పడక వర్షంపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బోరు బావులున్న రైతులు వరి పంటలకు బోరు నీటిని అందించాలనుకున్నా అప్రకటిత విద్యుత్ కోతలతో అందించలేని పరిస్థితి ఉంది. దీంతో తీవ్రంగా పంటలను నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

అప్రకటిత కోతలు..

గత కొన్ని రోజులుగా వర్షాలు కురువకపోవడంతో రైతులు చెరువులు, బోరుబావుల నీటిపైనే ఆధారపడ్డారు. బోరుబావులు ఉన్న రైతులు సకాలంలో పంటకు నీరందించాలనుకున్నా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండటంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజుకు 12 గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉన్నా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా చేయడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతున్న సమయంలో కూడా మధ్యమధ్యలో ఎన్నోసార్లు నిలిపివేస్తుండడంతో వరి పంటకు కావాల్సిన నీరు అందడంలేదని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో సుమారుగా 6వేల ఎకరాలకు పైగా వరి పంటలు వేసుకున్న రైతులు సకాలంలో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పనితీరు మార్చుకోవడంలేదని, విద్యుత్ సరఫరా చేయకుండా కాలయాపన చేస్తున్నారని రైతులు మండి పడుతున్నారు. ఈ విషయంపై శనివారం మండలంలోని చింతకుంట, చుంచుపల్లి గ్రామాల రైతులు స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు చేరుకుని విద్యుత్ ఏఈ ఇర్ఫాన్‌తో సమస్యలు విన్నవించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

వరి పంట ఎండుతోంది..



చుంచుపల్లి గ్రామ శివారులో మాకున్న ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. వర్షాలు సరిగా కురవక, బోరుబావి ఉన్నా విద్యుత్ సరఫరా లేకపోవడంతో మూడు ఎకరాల వరకు పంట ఎండిపోతుంది. విద్యుత్ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి త్రీఫేజ్ విద్యుత్‌ను రోజుకు 12 గంటలు సరఫరా చేయాలి.

– మోహన్‌నాయక్, చుంచుపల్లి

సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని గ్రామాల్లో బూత్‌కు 200 సభ్యత్వాలు నమోదు చేయించాలని జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సిద్దం సుహాసిని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సభ్యత్వ నమోదులో పాల్గొనా లని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాండ్రె విశాల్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, కార్యకర్తలు, తది తరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899